కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- పార్టీ మారే ప్రసక్తే లేదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

తొర్రూరు, ఆగస్టు 10: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్‌ను నియోజకవర్గంలో అగ్రగామిగా నిలుపుతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. తాను పార్టీ మారుతానని సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఎవరూ విశ్వసించవద్దని, బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదన్నారు. త్వరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, అన్ని విధాలుగా ఉండి గెలిపించుకుంటానని తెలిపారు. కష్టపడే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఇస్తూ పార్టీ బలోపేతానికి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుందామన్నారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసపూరిత హామీలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు సోమేశ్వర్‌రావు, తమ్మెర వీరభద్రరావు, ప్రమోద్ పాల్గొన్నారు.

గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్
- గుడుంబా బాధితులకు తోపుడు బండ్లు, కుట్టు మిషన్ల పంపిణీ

కొత్తగూడ, ఆగస్టు 10: మహబూబాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గూడూరు, గంగారం, కొత్తగూడ మండలాల్లోని పలు ప్రాంతాల్లో గుడుంబాకు బలై కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయారని, వారిని నమ్ముకున్న కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఎస్పీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఉపాధి కోసం తోపుడుబండ్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుడుంబా ఉచ్చులో పడి ఎంతోమంది అనాథలై అవస్థలు పడుతున్నారన్నారు. గుడుంబా ద్వారా నష్టపోయిన వారు, మిగతా వారికి దుష్ప్రభావాలపై అవగాహన కలిగించాలన్నారు. పోలీస్ కళాబృందాలతో మారుమూల ప్రాంతాల్లో సైతం అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు చేసి సుమారు రూ.1.60 కోట్ల విలువైన గుడుంబా, బెల్లం, పానకం ధ్వంసం చేశామన్నారు. యువత మంచి మార్గంలో నడిచి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని, ఇందుకు జిల్లా పోలీస్‌శాఖ అన్నివిధాలా అండగా నిలుస్తుందన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, చీరెలు అందజేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బాబురావు, బయ్యారం రవి, ఎస్సైలు గిరిధర్, కుశకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి

గూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. శనివారం గూడూరు సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాల యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించగా ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో పోలీసుల ఆధ్వర్యంలో యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తామని, అర్హులను వినియోగించుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని, విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమపేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మహిళలకు తోపుడుబండ్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

బోదకాలు నివారణే లక్ష్యంగా..

- వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలు
- ఆరు పీహెచ్‌సీల పరిధిలోని ఏజెన్సీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 25 వరకు మాత్రల పంపిణీ కార్యక్రమం
- జిల్లాలో 3,444 మంది బాధితులుండగా 341 మందికే పింఛన్

కొత్తపేటలో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎండీఏ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం

బయ్యారం, ఆగస్టు 9: జిల్లాలో బోదకాలు నివారణే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ ముందుస్తు చర్యలు చేపట్టింది. వ్యాధి ప్రబలకుండా ఏజెన్సీ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించిది. జిల్లాలో మొత్తం 3,444 మంది వ్యాధిగ్రస్తులున్నారు. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఇంటింటి సర్వేలో జిల్లావ్యాప్తంగా 10 కేసులు నమోదవగా కేవలం గంగారం మండలం వేనుబల్లిలో 5గురికి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమై ఏజెన్సీ మండలాలైన బయ్యారం, గంగారం, కొత్తగూడ, గార్ల పరిధిలోని బయ్యారం, గంధంపల్లి, ముల్కనూరు, కోమట్లగూడెం, గంగారం, కొత్తగూడ, పీహెచ్‌సీల పరిధిలో ఐపర్ మోక్సిస్, డీఈసీ అండ్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 10 నుంచి 25 వరకు చేపట్టనున్నది. 10 నుంచి 12 వరకు బూత్ లెవల్‌లో, 13 నుంచి 22 వరకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 23 నుంచి 25 వరకు మిగిలిన వారికి (మాపప్) మాత్రలు పంపిణీ చేయనున్నారు. రెండేళ్లు పైబడిన వారికి వయస్సు, ఎత్తును బట్టి తగిన మోతాదుల్లో మాత్రలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 3,444 మంది బాధితులుండగా కేవలం 341 మందికి మాత్రమే పింఛన్లు అందుతున్నాయి.

మిగతా వారు సైతం ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే తొలిరోజు బయ్యారం, గార్ల మండలాల్లో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎండీఏ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం, ఎస్‌సీవీబీడీసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్ రెడ్డి సందర్శించారు. ప్రతి ఒక్కరూ మాత్రలు తీసుకొ వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు.

పకడ్బందీగా మాత్రలు పంపిణీ చేయాలి

ఫైలేరియా (బోద) వ్యాధి నివారణ కోసం మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎండీఏ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట బూత్ లెవల్‌లో నిర్వహించిన మాత్రల పంపిణీని ఆయన పరిశీలించి మాట్లాడారు. బయ్యారం, గంధంపల్లి, ముల్కనూరు, గంగారం, కోమట్లగూడెం, కొత్తగూడ పీహెచ్ పరిధిలోని 1,13,700 మందికి మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీవీబీడీసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, వైద్యాధికారి విజయ్, పీహెచ్ఎన్ కళావతి, ఎంఎల్‌హెచ్‌పీ పవన్, దీవ్య పాల్గొన్నారు.

బోదకాల నివారణకు కృషి చేయాలి

గార్ల: మండల కేంద్రంలో శనివారం బోధకాల నివారణ కరపత్రాలను డీఎంహెచ్‌వో మురళీధర్ ప్రారంభించి మాట్లాడారు. బోదకాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న సతీశ్

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

కేసముద్రం, ఆగస్టు 10: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్థికంగా నష్టపోయిన పేదలను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు మార్తినేని పాపారావు మాట్లాడారు. పేదలకు అండగా ఉండి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సేకరించిన విరాళాలను జిల్లా కమిటీకి అందిస్తామని తెలిపారు.

వరద బాధితులకు అండగా నిలవాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10: వయనాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి అన్నారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలను రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితుల కోసం అన్నివర్గాల వారు తోచిన సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో కట్టెబోయిన శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మొక్కలు నాటడం దిన చర్య కావాలి'

మల్లన్నకు మొక్క అందజేస్తున్న వెంకన్న

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10: భావితరాల కోసం మొక్కలు నాటడం జీవితంలో దిన చర్య చేసుకోవాలని హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న అన్నారు. శనివారం పట్టణ శివారులోని సలార్‌తండా ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న దోసపాటి మల్లన్న ఉద్యోగోన్నతి పొందగా అతడికి మొక్క అందజేసి సన్మానించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, శుభ కార్యాలకు తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. వీరస్వామి, కొమిరె ఉప్పలయ్య, నాగయ్య, బండ ఆశన్న పాల్గొన్నారు.

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. శనివారం పట్టణంలో వార్డు బాట కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ అధికారులు వార్డుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలన్నారు. కాలనీల్లో సరైన డ్రైనేజీ లేక మురుగునీరు రోడ్లపై పారుతోందని, వర్షం పడడంతో బురదమయంగా మారాయన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. శంకర్, తరుణ్, రాకేశ్, వినోద్, విక్రమ్ పాల్గొన్నారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు శనివారం మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రధానంగా అనంతారం రోడ్డులోని హైమా గార్డెన్‌లో అంతర్గత రోడ్లపై గుంతలు పడ్డాయని, కాలనీ వాసుల సౌకర్యార్థం తాత్కాలిక మర్మతులు చేయించారు. అశోక్, జగన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నర్సింహులపేట, ఆగస్టు 10: మానసిక, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కౌసల్యదేవిపల్లిలో జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండి కృష్ణమూర్తి(70) అనారోగ్యంతో, మానసికంగా, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. శనివారం తన పొలం వద్ద మర్రి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి కుమారుడు కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నెల్లికుదురు, ఆగస్టు 10: అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన ఆకుల అజయ్, తుంపిల్ల ఉపేందర్ పరిసర గ్రామాల్లోని లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి తారాసింగ్‌బావిలోని ఓ రైస్ మిల్లు యజమాని దళపతి ఏసువర్మతో కలిసి మిల్లుకు 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా ఉపేందర్ ఇంటివద్ద పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

డోర్నకల్ సీఐగా రాజేశ్ బాధ్యతల స్వీకరణ

డోర్నకల్, ఆగస్టు 10: డోర్నకల్ పోలీస్ స్టేషన్ సీఐగా భూక్యా రాజేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ బంధం ఉపేందర్‌రావు బదిలీపై వెళ్లారు. పలువురు సీఐ రాజేశ్‌ను కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

మహిళా వేషధారణతో తిరుగుతున్న వ్యక్తి..

పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తున్న యువకులు

కేసముద్రం, ఆగస్టు 10: మండల కేంద్రంలో మహిళా వేషధారణతో తిరుగుతున్న వ్యక్తిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఉప్పరపల్లి రోడ్డులో ఓ వ్యక్తి మహిళా వేషధారణతో తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. అతడి వద్ద కొడవలి ఉండడంతో మహిళలు భయాందోళనకు గురయ్యారు. యువకులు పట్టుకొని విచారించగా, కేసముద్రంకు తనతో పాటు మరో వ్యక్తి నాందేడ్ నుంచి వచ్చాడని, రైల్వేస్టేషన్‌లో ఉన్నాడని తెలిపాడు. యువకులు అతడిని పోలీసులకు అప్పగించారు. అడుక్కోడానికి వచ్చాడని, అతడిని వరంగల్‌కు పంపించామని ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు.

దూర ప్రాంతాల నుంచి ఏఎన్ఎంల రాకపోకలు

- స్థానికంగా ఉండకపోవడంపై ప్రజల ఆగ్రహం
- వానకాలంలో ప్రబలుతున్న వ్యాధులు

ముల్కలపల్లి పల్లె దవాఖాన

డోర్నకల్, ఆగస్టు 10: పల్లె, బస్తీ దవాఖానల్లోని ఏఎన్ఎంలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజారోగ్య సేవలు మరింత అందుబాటులోకి తెచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెలు, బస్తీల్లో దవాఖానలను ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి, సరిపడ మందులు అందుబాటులో ఉంచింది. కానీ, ప్రస్తుత పాలకులు ఆయా దవాఖానల్లో సిబ్బంది పనితీరును పర్యవేక్షించడంలేదు. మండలంలో 13సబ్‌సెంటర్లుండగా, అధిక సంఖ్యలో సబ్ సెంటర్లలోని ఏఎన్ఎంలు మహబూబాబాద్, ఖమ్మం తదితర దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రస్తుత సమయంలో ఏఎన్ఎంలు స్థానికంగా నివసించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై డోర్నకల్ పీహెచ్‌సీ వైద్యాధికారి సద్విజను వివరణ కోరగా పల్లె దవాఖానల ఏఎన్ఎంలు స్థానికంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని, దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎంలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రభుకిరణ్

ప్రభుకిరణ్

కేసముద్రం, ఆగస్టు 10: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రజ్వల్ ట్రేడింగ్ కంపెనీ యజమాని ఓలం ప్రభుకిరణ్ ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా భోనగిరి ఉపేందర్, కోశాధికారిగా కొళ్లూరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా శ్రీరాంకిరణ్, సహాయ కార్యదర్శిగా కట్కూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి, సంకపల్లి జనార్దన్‌రెడ్డి, శ్రీరాం చంద్రన్‌కుమార్, చిదురాల వసంతరావు, బిజ్జాల వెంకటేశ్వర్లు, తోట వెంకటేశ్ ఉన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్

నవీన్

తొర్రూరు, ఆగస్టు 10: భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొర్రూరుకు చెందిన కాగు నవీన్‌ను నియమించినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నవీన్ సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ నవీన్ ధన్యవాదాలు తెలిపారు.

బీజేవైఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయికుమార్

సాయికుమార్

దంతాలపల్లి: భారతీయ జనతా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా అల్లం సాయికుమార్‌ను ఎన్నుకున్నట్లు యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. దంతాలపల్లికి చెందిన సాయికుమార్ 10ఏళ్లుగా పార్టీ కోసం చేసిన సేవాలను గుర్తించి జిల్లా కమిటీలో అవకాశం కల్పించినట్లు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

అవసరార్థులకు అండగా లయన్స్ సేవలు

తొర్రూరు, ఆగస్టు 10: అవసరార్థులకు అండగా లయన్స్ సేవలు ఉండాలని లయన్స్ పూర్వ గవర్నర్ కే రాజేందర్‌రెడ్డి అన్నారు. కొండ్లె ఉమేశ్ పుట్టినరోజు సందర్భంగా క్లబ్ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అల్పాహార వితరణ, గోశాలలో గోదానం, కూరగాయలు అందించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ వినాయక ఫ్రెండ్స్ సేవలు అభినందనీయమన్నారు. జిల్లా క్యాబినెట్ సెక్రటరీ రేగూరి వెంకన్న, జోన్ చైర్మన్ రేగూరి శ్రీదేవి, చార్టర్ అధ్యక్షుడు లయన్ కందగడ్డ సోమశేఖర్, క్లబ్ ఆఫ్ వినాయక ఫ్రెండ్స్ ప్రధాన కార్యదర్శి చిలకమారి రామచంద్రయ్య, కోశాధికారి తల్లాడి హీరాదర్, వైస్ ప్రెసిడెంట్ బుదారపు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు లెనిన్‌నగర్‌లో శనివారం ఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై దివ్యాంగులకు అందజేశారు. వీల్ చైర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేవ్య, గణేశ్, కిరణ్, అబ్రహాం, మోషయ్య పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి మరియన్న తెలిపారు. నిత్యం మనం తినే ఆహార పదార్థాల్లో 80శాతం ఆయిల్‌పామ్‌కు సంబంధించిన వస్తువులే అధికంగా ఉంటాయన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన నేలలు, వాతావరణ పరిస్థితులు ఉన్నాయని, ఎకరాకు రూ.లక్షకుపైగా ఆదాయం వస్తుందని, అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

కేసముద్రం, ఆగస్టు 10: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్యాయతానికి పాల్పడిన ఘటన మండలంలోని కల్వల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోనేటి వెంకన్న-మమత దంపతులు హైదరాబాద్‌లో నివాసముంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరగుతున్నది. శుక్రవారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెంది హైదరాబాద్ నుంచి వెంకన్న ఇంటికి వచ్చి కత్తితో గొంతు, చెయ్యి కోసుకొని సానికులకు సమాచారం అందించాడు. వారు వచ్చి 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ విషయంపై ఎస్సై మురళీధర్‌రాజ్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న డీఈ మధుసూదన్, సిబ్బంది

చిన్నగూడూరు, ఆగస్టు 10: విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం జాగ్రత్తలు పాటించాలని తొర్రూరు ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్ అన్నారు. సీఎండీ ఆదేశాల మేరకు శనివారం విద్యుత్‌శాఖ 'పొలం బాట'లో మరిపెడ మండలం, చిన్నగూడూరు మండలాల పరిధిలో డీఈ, ఏడీఈ లోక్‌నాథ్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద మోటర్లు కాలిపోకుండా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, స్టాటర్లకు ప్లాస్టిక్ డబ్బాలు ఉపయోగించాలన్నారు. పొలాల్లో వంగిన విద్యుత్ పోల్స్, లూజు టీగలను సరిచేస్తామని తెలిపారు. ఏఈలు అజయ్, నవ్య, సబ్ ఇన్‌జనీర్ రుబినా, లైన్‌మెన్ వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో అవగాహన

దంతాలపల్లి: దంతాలపల్లి విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రేపోణిలో 'పొలంబాట'లో భాగంగా డీఈ మధుసూదన్ వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజుల సమస్య వస్తే సిబ్బందితో మాత్రమే చేయించాలన్నారు. ఓవర్‌లోడ్ లేకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఏఈ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ బోనాలకు నిధులు నిల్

- గ్రామ పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు
- సొంతంగా రూ.1.5లక్షలతో ఏర్పాట్లు చేయిస్తున్న మాజీ సర్పంచ్ రమేశ్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ రమేశ్

గూడూరు, ఆగస్టు10: శ్రావణమాసంలో గూడూరు మేజర్ గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో గ్రామదేవత అయిన ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించుకుంటారు. కానీ ఈ ఏడాది మాత్రం నిధులు లేవని గ్రామపంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. గూడూరు, చంద్రగూడెం, గొల్లగూడెం గ్రామాల్లోని ముత్యాలమ్మకు నేడు బోనాలు సమర్పించనున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో మాజీ సర్పంచ్ రమేశ్ సొంతంగా రూ.1.5లక్షలతో భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేయించి, డీజే సౌండ్స్, డప్పులు, విద్యుత్ దీపాలు, కులవృత్తుల వారికి సంభావనతో పాటు అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చేయించారు. కాగా, గ్రామ పంచాయతీ అధికారులు ఆలయాల వద్ద భక్తల కోసం ఏర్పాట్లు చేయకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది వరకు పంచాయతీ నిధులుండగా, ఈ సంవత్సరం గ్రామ దేవతలకు ఎందుకు నిధులు కేటాయించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సేవాతరుణి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న సేవాతరుణి సభ్యులు

తొర్రూరు, ఆగస్టు 10: పేద విద్యార్థులను ఆదుకోవాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవాతరుణి అధ్యక్షురాలు మాధవ పెద్ది వాణి ఆధ్వర్యంలో క్లబ్ 8వ ఇన్‌స్టాలేషన్ సందర్భంగా క్లబ్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ టీ శ్రీదేవి రెడ్డి-వెంకటరెడ్డి దంపతులు పదో తరగతి 2023-24బ్యాచ్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన తొర్రూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు డీ నిశాల్, పీ సాయి అక్షిత్‌కు రూ.5 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద విద్యార్థులను గుర్తించి సేవా తరుణి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఫస్ట్ వైస్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, సెకండ్ వ